బాబోయ్ బైపాస్..

- అనుసంధాన రోడ్లు సక్రమంగా లేక ప్రమాదాలు
- పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

అమలాపురం రూరల్: ఆ దారుల్లో వణుకే.. ప్రయాణం చికాకే.. బైపాస్ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. జాతీయ రహదారి 216లో అమలాపురం, ముమ్మిడివరంలలో బైపాస్ రోడ్లు నిర్మించారు. వీటికి అనుసంధాన రోడ్లు సక్రమంగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అమలాపురం పట్టణాన్ని ఆనుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో పేరూరు నుంచి భట్నవిల్లి వరకూ అధునాతన బైపాస్ రోడ్లు నిర్మించారు. భట్నవిల్లి, కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం, పేరూరు గ్రామాల నుంచి బైపాస్ రోడ్డు నుంచి అమలాపురం పట్టణంలోకి వచ్చేందుకు మూడు ప్రాంతాల్లో అనుసంధాన రహదారులు ఉన్నాయి. ఐదు కిలోమీటర్ల పరిధిలో నాలుగు గ్రామాల వెంబడి ఈ రహదారి ఉంది. ఈ దారిలో నెలకు సుమారు పది చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులు చనిపోతున్నా జాతీయ రహదారి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పేరూరు వై.జంక్షన్, భట్నవిల్లి వద్ద ఉన్న అనుసంధాన రోడ్లు విశాలంగా ఉన్నాయి. కామనగరువు– చిందాడగరువు జంక్షన్, రోళ్లపాలెం చిట్టిగరువు, రోళ్లపాలెం ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. ఇక్కడ రోడ్ల విస్తరణ జరగలేదు. పైగా ఈ రోడ్లు అధ్వానంగా మారాయి. భట్నవిల్లి, పేరూరు వై.జంక్షన్ దాటిన తర్వాత పట్టణంలోకి రావాలన్నా, పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాలకు వెళ్లాలన్నా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమలాపురం – చల్లపల్లి కాలువ పైనుంచి వెళుతున్న 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు అనుసంధానం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అమలాపురం– చల్లపల్లి పంట కాలువకు ఇరువైపులా ప్రధాన రోడ్లు ఉన్నాయి. అమలాపురం నుంచి చల్లపల్లి, అమలాపురం నుంచి కామనగరువు మీదుగా సమనస– చల్లపల్లి వెళ్లేందుకు బైపాస్ నుంచి దిగేందుకు అనువుగా కనెక్టివిటీ రోడ్లు నిర్మించలేదు. ఈ రోడ్ల మీదుగా బైపాస్ వెళ్లేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మించారు. కానీ వంతెన నుంచి కిందకు దిగడానికి చల్లపల్లి, అమలాపురం వచ్చేందుకు వీలుగా అనుసంధాన రోడ్డు నిర్మించలేదు. బైపాస్‌కు భూమి సేకరిస్తున్న సమయంలో కనెక్టివిటీ రోడ్ల విషయాన్ని జాతీయ రహదారి అధికారులు పట్టించుకోలేదు. అమలాపురం పట్టణంలోకి రావాలంటే బైపాస్ నుంచి కామనగరువు వద్ద విత్తనాలవారిపాలెం మీదుగా శ్రీరామపురం, రోళ్లపాలెం చిట్టిగరువు అబ్బిరెడ్డివారివీధి మీదుగా, రోళ్లపాలెం ప్రధాన రోడ్డు నుంచి వెళ్లాలి.

ప్రతిపాదనలు గాలికి..

కాకినాడ హైవే నుంచి వచ్చే వాహనదారులు చల్లపల్లి, ఎస్.యానాం, నవరప్పాలెం, సమనస, కూనవరం, చల్లిపల్లి గ్రామాలకు వెళ్లాలంటే భట్నవిల్లి నుంచి గాని, పితానివారిపాలెం, కామనగరువు, విత్తనాలపాలెం, ఎర్రవంతెన మీదుగా పట్టణంలోకి వచ్చి అప్పుడు వెళ్లాలి. దీనివల్ల ఈ రోడ్లలో ట్రాఫిక్ అధికమవుతోంది. ముమ్మిడివరంలో ఎయిమ్స్ కాలేజీ వద్ద నుంచి బైపాస్ రోడ్డు ముమ్మిడివరం మూలతూము మీదుగా మూడు ప్రాంతాల్లో కనెక్టివిటీ రోడ్లు ఉన్నాయి. తానేలంక, కొండాలమ్మ చింత, మూలతూము వద్ద అనుసంధాన రోడ్డు ఉంది. అయితే ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎన్నో ప్రమాదాలు..

ఇటీవల అమలాపురం నుంచి బైపాస్ రహదారి మీదుగా ఆటోమొబైల్స్ దుకాణం వద్ద కాకినాడ వెళ్లేందుకు ఓ కారు మలుపు తిరిగింది. ఇంతలోనే ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. కారులో ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. రోళ్లపాలెం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందారు. గత సంవత్సరంలో వ్యాన్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న అమలాపురానికి చెందిన భార్యాభర్తలు మృతి చెందారు.



అమలాపురం బైపాస్ రోడ్డులో రోళ్లపాలెం వద్ద ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం



ఇరుకుగా రోళ్లపాలెం రోడ్డు



ఇటీవల కామనగరువు వద్ద జరిగిన కారు ప్రమాదం

తరచూ ప్రమాదాలు



అమలాపురం బైపాస్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనుసంధాన రోడ్లు సక్రమంగా లేవు. కామనగరువు వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. కామనగరువు, చల్లపల్లి పంట కాలువ వద్ద రోడ్డు విస్తరించడంతో పాటు అనుసంధాన రోడ్లు నిర్మించాలని కలెక్టర్‌కు ఏడాది క్రితం ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి:

–నక్కా అరుణకుమారి, సర్పంచ్, కామనగరువు

తగిన చర్యలు తీసుకోవాలి



అమలాపురం బైపాస్‌లో భట్నవిల్లి– పేరూరు వద్ద ప్రమాదాలు అధికమయ్యాయి. గతంలో అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు చనిపోయారు. అదే విధంగా బోడసకుర్రు బ్రిడ్జి వద్ద, పేరూరు– తొట్లపాలెం జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు కనీస ఏర్పాట్లు చేయాలి.

–అరిగెల వెంకట రామారావు, అమలాపురం

క్లుప్తంగా

అంధ విద్యార్థులకు వితరణ



అంధ విద్యార్థులకు దుస్తులు అందజేసిన గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక లూయీ అంధుల పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. నెదర్లాండ్స్‌లో ఉంటున్న యనముల రోహిత్‌కుమార్ తన తల్లి అలివేలు మంగతాయారు జ్ఞాపకార్థం ఈ వితరణ జరిగింది. రూ.22 వేల విలువైన వస్త్రాలను అంధ విద్యార్థులకు అందజేశారు. ప్రతినిధులు గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణ కామేశ్వర్, కుడుపూడి త్రినాథ్, గోటేటి లక్ష్మి, అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాసరావు తదితరుల చేతుల మీదుగా నూతన వస్త్రాల పంపిణీ జరిగింది.

దుప్పట్లు, చీరల పంపిణీ



వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ముమ్మిడివరం: అయినాపురం జాన్ మెమోరియల్ చర్చిలో అమలాపురం రైజింగ్ హోప్ ఫౌండేషన్ సౌజన్యంతో కొంకాపల్లి విజయ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని సుమారు 35 మందికి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంటా అంబేడ్కర్ రతన్ బెనర్జీ, మెల్లం దుర్గాప్రసాద్, పాస్టర్ వి.సువర్ణరాజు, పాస్టర్ డి.అన్నామణి, ఎం.రత్నం, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల వుమెన్స్ వింగ్ అధ్యక్షురాలిగా సుజాత



అమలాపురం టౌన్: మానవ హక్కుల ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా అమలాపురం డివిజన్ వుమెన్ వింగ్ అధ్యక్షురాలిగా కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన సాక సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు ఆ ఆర్గనైజేషన్ జాతీయ సలహాదారు, పోలీస్ అధికారి యలమంచిలి వెంకటరమణ, ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప బరిగె ఆమెకు నియామక ఉత్తర్వులు పంపించారు. ఈ మేరకు అమలాపురంలో సుజాత శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మానవ హక్కుల సంరక్షణ లక్ష్యంగా ఏర్పడిన ఈ ఆర్గనైజేషన్ కోసం తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని సుజాత వివరించారు.

ప్రేమ పూర్వకంగా మొక్కలు నాటుదాం..



అమలాపురంలో మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవా సమితి డివిజన్ కో ఆర్డినేటర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: శ్రీసత్య సాయి సేవా సమితి ప్రేమ తరువు కార్యక్రమంలో సమితి ప్రతినిధులు అమలాపురంలో పలుచోట్ల శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆ సేవా సమితి అమలాపురం డివిజన్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రేమ తరువు కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా కోటి మొక్కలు నాటనున్నారని అన్నారు. సేవా సమితికి చెందిన ప్రతి సభ్యుడు ప్రేమ పూర్వకంగా ఓ మొక్క నాటాలన్న పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. అమలాపురం శివారులోని ఓ లేఅవుట్‌లో వంద మొక్కలు నాటి నీరు పోశారు. వీటి సంరక్షణను సేవా సమితి సభ్యులు పర్యవేక్షిస్తుంటారని ప్రభాకర్ తెలిపారు.

కారు బోల్తా: తప్పిన ప్రాణాపాయం

ఆలమూరు: 216 (ఏ) నంబర్ జాతీయ రహదారిలోని జొన్నాడలో జరిగిన కారు బోల్తా పడిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి ప్రాణాపాయం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఒక చిన్న కారు స్థానిక ఫ్లైఓవర్ వద్దకు వచ్చే సరికి అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు వల్ల ఇసుక ట్రాక్టర్‌ను తప్పించబోయి బోల్తా కొట్టింది. స్థానికులు స్పందించి కారులో చిక్కుకున్న రాజోలు గ్రామానికి చెందిన ఎం.దేవరాజ్ కుటుంబ సభ్యులను సురక్షితంగా బయటకు తీయడంతో వారంతా స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఒక మహిళ, ఒక పురుషుడుతో పాటు నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. దాంతో పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చిరస్మరణీయురాలు సావిత్రీబాయి ఫూలే



ఇందుపల్లిలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన హెచ్‌ఎం



అమలాపురంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం

ముమ్మిడివరం: మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివని స్థానిక శ్రీకృష్ణదేవరాయ జూనియర్, ఆర్‌బీఆర్‌వీఎస్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ జగతా సురేష్, అధ్యాపకులు గుర్రం మహేష్, గణేశుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఇందుపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విత్తనాల శ్రీనివాసరావు అధ్యక్షతన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాలు జీవీఎస్ఎస్ హైమావతి, ఆర్.నళినీ కుమారిని ఘనంగా సత్కరించారు. వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను హెచ్‌ఎం నాగసత్యనారాయణ తదితరులు సన్మానించారు. బండారులంక కందులపాడు కాలనీలో బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలమూరి మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావులు సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలో దళిత సేన ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. దళిత సేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్, నాయకులు సాపే రమేష్, తానంకి వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: సావిత్రీబాయి జయంతిని సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో ఘనంగా నిర్వహించారు. విశ్వజన కళా మండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని హెచ్‌ఎం కె.ఘన సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సామూహిక సత్కారాలు చేశారు. ప్రతి విద్యార్థి సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎం పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, పీవీఎల్ఎస్ శ్రీరామ్, కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి.నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

యానాం: సావిత్రీబాయి పూలే జయంతిని ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌నగర్ దీనపోషక సమాజంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ రీజినల్ అడ్మినిస్ట్రేటర్ గిడ్డి బలరామ్, రిటైర్డ్ ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, పండు సిద్ధార్థకుమార్, కడలి వలీ బాబా, దుగ్గదుర్తి అనిత పాల్గొన్నారు

శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

అమలాపురం టౌన్: తొత్తరమూడి శివారు చిన్నపాలేనికి చెందిన యనమదల సాకేత్ (4) శరీరం హీటర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ మానవతా దృక్పథంతో తమ వంతు చేయూత అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాకేతకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలను అతని తండ్రి ఫోన్ నంబర్‌కు ముమ్మిడివరం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధుల ద్వారా ఫోన్ పేలో శుక్రవారం పంపించారు. తొత్తరమూడిలోని సాకేత్ కుటుంబీకులను సంస్థ ప్రతినిధులు పలకరించి ఈ సాయాన్ని సమకూర్చారు. సంస్థ ప్రతినిధులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్, చెల్లుబోయిన నాని, రెడ్డి శ్రీమన్నారాయణ, కడలి నాగు, మట్టపర్తి సురేష్, కుడుపూడి విద్యాసాగర్, వాసంశెట్టి ఫణి, రాయుడు చిన్ని తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

6 నుంచి యానాం ప్రజా ఉత్సవాలు



ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం పర్యాటక శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఈ నెల 6నుంచి 8 వరకూ స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 21వ యానాం ప్రజా ఉత్సవాలు, 23వ ఫల, పుష్ప ప్రదర్శన జరగనున్నాయి. ప్రజా ఉత్సవాలను సీఎం రంగసామి ప్రారంభించడానికి వస్తున్న నేపథ్యంలో విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ప్రజా ఉత్సవాల్లో భాగంగా 6న జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధ్యక్షత వహించనున్నారు. ఇందులో భాగంగా 6న మొదటిరోజు జాతీయ సమైక్యతను ప్రతిబింబించే నృత్యాలు, రామాయణ, మహాభారత షార్ట్ స్టోరీలు, ఇండియా గాట్ టాలెంట్ విన్నర్ తౌజెండ్ హ్యాండ్స్ డ్యాన్స్ తదితరమైన కార్యక్రమాలు జరగనున్నాయి. ఫల, పుష్ప ప్రదర్శనకు ఇప్పటికే పూణే, కడియం తదితర ప్రాంతాల నుంచి ఆకట్టుకునే విధంగా ఉన్న పుష్పజాతి మొక్కలను ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి బాలయోగి స్టేడియంలో పెడుతున్నారు. చివరిరోజు కార్యక్రమానికి ఎల్జీ కె.కైలాషనాథన్ హాజరు కానున్నారు. అదేవిధంగా మంత్రులు లక్ష్మీనారాయణ, తిరుమురుగన్, రాజవేలు, జయకుమార్, స్పీకర్ సెల్వం తదితరులు రానున్నారు.

అవార్డు ప్రదానం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన సైన్స్ పనోరమ అధ్యక్షుడు, గ్లోబల్ టీచర్స్ రోల్ మోడల్ అవార్డు గ్రహీత దివంగత గురునాథరాజును స్థానిక లీడ్ ద లైవ్స్ సంస్థ ఎన్‌లైటెనింగ్ ఎడ్యుకేటర్ అవార్డుకు ఎంపిక చేసింది. స్థానిక యర్రమిల్లివారి వీధిలోని ఆ సంస్థ కార్యాలయంలో ఈ అవార్డును దివంగత గురునాథరాజు బంధువు, సివిల్ ఇంజినీర్ బీఎస్ శ్రీనివాస్‌కు సంస్థ డైరెక్టర్లు చిక్కం శాంతి స్వరూప్, సాంబశివరావు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత గురునాథరాజు ఉపాధ్యాయ జీవితాన్ని క్రమశిక్షణ, నిజాయితీతో నిర్వహించడమే కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో తన సైన్స్ పనోరమ సంస్థ ద్వారా ఎన్నో ప్రయోగాలు, ఫలితాలతో సమాజ వికాసానికి పాటుపడ్డారని గుర్తు చేశారు. అనంతరం లక్ష్మీనరసమాంబ ప్రసంగించారు.



గురునాథరాజు బంధువు శ్రీనివాస్‌కు అవార్డు ఇస్తున్న లీడ్ ద లైవ్స్ సంస్థ ప్రతినిధులు

డీలర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

అమలాపురం రూరల్: డివిజన్‌లోని వివిధ మండలాల్లో రేషన్ డీలర్లు మరణించడం, రాజీనామా కారణంగా రద్దయిన 105 డీలర్ల స్థానాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆర్డీవో కె.మాధవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో వ్యక్తిగతంగా లేక రిజిస్టర్ పోస్ట్ ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. దరఖాస్తుతో పాటు, ఫీజుగా అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి పేరున రూ.300 డీడీ డ్రాఫ్ట్ జత చేయాలన్నారు. అన్నీ సక్రమంగా ఉంటే రాత పరీక్షను 19న నిర్వహిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

అమలాపురం రూరల్: తాండవపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన బి.ఆదిశంకరం పదోన్నతిపై భట్నవెల్లికి వెళ్తున్న సందర్భంగా శుక్రవారం సన్మానించారు. పంచాయతీ వద్ద సర్పంచ్ గంగుమల్ల ఏసుబాబు ఆధ్వర్యంలో ఆదిశంకరాన్ని సత్కరించారు. ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ పరమట శరత్‌బాబు, ఉప సర్పంచ్ గుత్తాల సత్యనారాయణ, నాయకులు కైరం సత్తిబాబు, కైరం రాము, నంద్యాల దొరబాబు, నంద్యాల రామారావు, గూడాల ధనలక్ష్మి, పరమట శ్రీను పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా



నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ముమ్మిడివరం: మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గతంలో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాల అమలు, మూడున్నర ఏళ్లు పూర్తయిన ప్రతి కార్మికుడిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్, నక్కా అరుణ్‌కుమార్, గుత్తుల రమేష్, వంటపాటి వెంకటేశ్వర్లు, యల్లమిల్లి వెంకటరమణ, రుద్రరాజు అరుణ, కె.వెంకటశివ, కె.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పొంగల్ కానుక రూ.750 జమ

యానాం: పొంగల్‌ను పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వం ప్రజలకు పొంగల్ కానుకను శుక్రవారం పుదుచ్చేరి సీఎం రంగసామి ప్రకటించారు. ఈ సందర్భంగా పొంగల్ కిట్‌కు బదులుగా రూ.750 అందించనున్నట్లు ఈ మొత్తం ఆయా రేషన్ కార్డుదారుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనున్నట్లు తెలిపారు. దీంతో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలోని వారు లబ్ధి పొందనున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



కామనగురువు వద్ద బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న రవాణా అధికారి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: అమలాపురం బైపాస్ రోడ్డులో కామనగరువు ఆమని ఆటోమొబైల్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని, డ్రైనేజీ వద్ద వంతెనకు రక్షణ గోడ ఎత్తు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వివరించారు. రోడ్డు వద్ద సర్కిల్ ఏర్పాటు కోసం కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. ప్రమాదాలకు గల కారణాలను గ్రామ సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావును అడిగి తెలుసుకున్నారు.

ఈదరపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటు



ఈదరపల్లి ముఖ్య కూడలిలో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కీలకంగా ఉండే ఈదరపల్లి ప్రధాన కూడళ్లలో పలు ప్రదేశాలు కవరయ్యేలా ఐదు సీసీ కెమెరాలను శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సీసీ కెమెరాల ద్వారా ఈదరపల్లిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల గుర్తింపు, అదుపు వంటి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. సీసీ కెమెరాలు చిత్రీకరించే దృశ్యాలను సీఐ వీరబాబుతో పాటు పట్టణ ఎస్సై కిషోర్‌బాబు శుక్రవారం రాత్రి పర్యవేక్షించారు.

ఎంపిక జాబితా ప్రకటన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 64 అసిస్టెంట్ పోస్టులను లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ ఎగ్జామ్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో యానాం నుంచి ఎంపిక జాబితాలో జనరల్ కోటాలో మత్స్యశాఖలో యూడీసీ సలాది వీవీఎల్ఎన్ స్వామి, మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో యూడీసీ జి.వెంకటచైతన్య, జీజీహెచ్‌లో యూడీసీ బండారు సూర్యఆముక్తమాల్యద, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్‌లో యూడీసీ పోతుల వెంకటేశ్వరి ఎంపిక కాగా, మిగిలిన వారు పుదుచ్చేరి, కారైకల్, మాహే ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు.

వంతెన... ఇంతేనా!



శిథిలావస్థకు చేరిన సరిపల్లి వంతెన

ఉప్పలగుప్తం: సరిపల్లి గ్రామంలో చల్లపల్లి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీనిని రెండు దశాబ్దాల కిందట ఏర్పాటు చేశారు. అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల రహదారులను కలిపే ఈ వంతెన అధికారుల పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరింది. సరిపల్లి గ్రామస్తులు మండల, జిల్లా కేంద్రాలకు రావాలన్నా ఇటు నుంచే ప్రయాణించాల్సి ఉంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుళాయితో చెట్టుపట్టాల్..

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధి కంసాలమామిడిలో నెల రోజుల కిందట పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వెనుక పుంతపేటలో మోసుగంటి దుర్గాప్రసాద్‌కు ఇంటికి సమీపంలో పబ్లిక్ కుళాయి ఏర్పాటులో అధికారుల పనితనం చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. కుళాయిని కొబ్బరి చెట్ల ఆకుల మధ్య ఎలాంటి సపోర్టు లేకుండా ఏర్పాటు చేసి వదిలేశారు. పోనీ నిర్మించిన కుళాయి నుంచి నీరు వస్తుందంటే అదీ జరగడం లేదు. కేవలం అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. పైప్‌లైన్ కోసం తవ్విన గోతులు పూడ్చలేదు. కూటమి ప్రభుత్వంలో అధికారుల పనితనం చూసి అంతా నవ్వుకుంటున్నారు.



కంసాలమామిడిలో కొబ్బరి చెట్టు మధ్యలో ఏర్పాటు చేసిన కుళాయి